11వ పాఠం	డిశంబరు 4-10

# తరువాత వచ్చిన రచనలలో ఉన్న ద్వితియోపదేశకాండము

సబ్బాతు మధ్యాహ్నము	డిశంబరు 4

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యములు : 2రాజు 22; నెహె 9:6; యిర్మి 7:1-7; కీర్తన 148:4; యిర్మి 29:13; మీకా 6:1-8; దాని 9:1-19.**

**కంఠతవచనం : "అయితే అక్కడ నుండి నీ దేవుడైన యెహోవాను మీరు వెదకిన యెడల, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ హృదయముతోను వెదకునప్పుడు ఆయన నీకు ప్రత్యక్షమగును" (ద్వితియోప 4:29).**

బైబిలులో ముఖ్యముగా పాతనిబంధన గ్రంథములో ఎక్కువ ఆసక్తిని కలిగించే విషయమేమిటంటే, అది తరచుగా సమాచారము కొరకు తనకు తానే సంప్రదించుకుంటుంది లేక ఉదహరించుకుంటుంది. ఉదా: ముందు వ్రాసిన పాతనిబంధన గ్రంథకర్తలు వారు చెప్పే విషయాన్ని ధృవీకరించుకొనుటకు లేక వివరించుటకు, వారికన్నా ముందు వ్రాసిన గ్రంథకర్తల పుస్తకాలను ఉదాహరించేవారు.

కీర్తన 81వ అధ్యాయము నిర్గమకాండములోని పదియాజ్ఞల యొక్క ఉపోద్ఘాతమును దాదాపుగా ఆ మాటలనే ఉదహరిస్తూ కీర్తనీయుడు ఈవిధముగా వ్రాసాడు. "ఐగుప్తీయుల దేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడనగు యెహోవాను నేనే" (కీర్తన 81:10).

పాతనిబంధన గ్రంథమంతటిలో ముఖ్యముగా ఆదికాండము నుండి సృష్టి వృత్తాంతమును యిర్మీయాలో ఈ విధముగా ఉదాహరించబడింది. "నేను భూమిని చూడగా అది నిరాకారముగాను శూన్యముగాను ఉండెను. ఆకాశము తట్టు చూడగా అచ్చట వెలుగు లేకపోయెను" (యిర్మీయా 4:23; ఆది 1:2 కూడా చూడుడి).

అవును అనేక సమయాలలో తరువాత వచ్చిన పాతనిబంధన గ్రంథకర్తలు, ఉదాహరణకు ప్రవక్తలు ద్వితియోపదేశకాండమునకు వెళ్ళి పురాతన ఇశ్రాయేలీయుల నిబంధన జీవితానికి సంబంధించి ప్రధాన పాత్ర ఏమైయుందో అనే విషయాన్ని వారి రచనలలో పొందుపరిచారు.

ద్వితియోపదేశకాండము వ్రాయబడిన తరువాత వచ్చిన పాతనిబంధన గ్రంథకర్తలు ఏవిధముగా ద్వితియోపదేశకాండములోని సమాచారమును ఉదహరించారో

అనే విషయాన్ని ఈ వారము మన అధ్యయనములో పరిశీలించబోవుచున్నాము.

– డిశంబరు 11, సబ్బాతు దినాన ఈ పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతా సిద్దపడుడి.

**ఆదివారం** **డిశంబరు 5**

## ధర్మశాస్త్రగ్రంథము

యూదయ రాజైన యోషీయా 8 సం॥ వయస్సపుడు రాజ్యపాలన మొదలు పెట్టి యుద్ధ భూమిలో మరణించుటకు ముందు 31 సం॥లు పరిపాలన చేసెను. (క్రీ.పూ.640–క్రీ.పూ. 609) అతడు పరిపాలన ఆరంభించిన తరువాత 18వ సం॥లో ఒక సంఘటన సంభవించినది. అది దేవుని ప్రజల యొక్క చరిత్రను మార్చివేసినది.

**2రాజు 22 చదువుడి. ఆ సంఘటన నుండి ఏ పాఠమును నేర్చుకొనగలము?**

అనేక సంవత్సరములు ఇశ్రాయేలు ప్రజలకు అందుబాటులో లేకుండా కనిపించకుండాపోయిన ద్వితియోపదేశకాండమును "ధర్మశాస్త్రగ్రంథమని" బైబిలు పండితులు ఒక నిర్ధారణకు వచ్చారు (2రాజులు 22:8).

"ఈ పురాతన వ్రాత ప్రతిలో పేర్కొనబడిన హెచ్చరికలు మరియు బోధలను వినిన యోషీయా ఎంతగానో చలించిపోయాడు. దేవుడు ఇశ్రాయేలీయుల యెదుట ఉంచిన జీవము, మరణము, ఆశీర్వాదము, శాపము గూర్చి ముందెన్నడు అతడు వినియుండలేదు (ద్వితి 30:19) ఎవరైతే దేవుని యందు పూర్తి నమ్మకమునుంచుదురో అట్టి వారిని ఏ స్థితిలో ఉన్నా రక్షించుటకు దేవుడు వాగ్దానమిచ్చెను. ఐగుప్తు బానిసత్వము నుండి ఏవిధముగా వారిని విడుదల చేసెనో, ఆ రీతిగానే వాగ్దాన భూమిలో వారిని స్థిరపరచి భూమి మీద ఉన్న ఇతర దేశములపై వారిని తలగా చేస్తానని చెప్పెను" –ఎలెన్ జివైట్, ప్రవక్తలు మరియు రాజులు, పుట 393.

తరువాత అధ్యాయములో రాజైన యోషీయా ఎంతో చిత్తశుద్దితో యెహోవా దేవుని మార్గములలో నడుచుటకును, ఆయన ఆజ్ఞలను కట్టడలను శాసనములను పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మతోను గైకొందుమని వాగ్దానము చేసెను. (2రాజులు 23:3; ద్వితి 4:29; ద్వితి 6:5; 10:12; 11:13 కూడా చదువుడి. ఈ సంస్కరణలో భాగముగా యూదయ దేశములోను, యెరూషలేములోను స్థాపించబడిన "మరియు

కర్ణపిశాచి గల వారిని, సోదె చెప్పు వారిని, గృహ దేవతలను విగ్రహములను, యూదా దేశమందును, యెరుషలేమునందును కనబడిన విగ్రహములన్నిటిని తీసివేసి యెహోవా మందిరమందు యాజకుడైన హిల్కీయాకు దొరికిన గ్రంథమందు వ్రాసియున్న ధర్మశాస్త్ర విధులను స్థిరపరచుటకై ప్రయత్నము చేసెను" (2రాజు 23:24).

ద్వితియోపదేశకాండము హెచ్చరికలతోను, హితబోధలతోను నిండియున్నది. ఆయన ఏలుబడి క్రింద సమరయలో విగ్రహారాధన నిర్వహించే యాజకులను సంహరించెను (2రాజులు 23:20) దానిని బట్టి ఇశ్రాయేలు ప్రజలు దేవునికి ఎంత దూరముగా వెళ్ళిపోయారో అనే విషయము అర్థమవుతుంది. మేము దేవునితో సక్రమముగానే ప్రవర్తిస్తున్నామనుకుంటూ లోకముతో అన్ని విషయాలలో రాజీపడి మోసపూరితమైన జీవితమును జీవించుచున్నారు.

**మన సొంత గృహాలలోను లేక సంస్థలలోను సంస్కరించవలసిన విషయాలేమిటి? ఏవిధముగా మన పూర్ణహృదయముతోను, పూర్ణ ఆత్మతోను దేవునిని ప్రేమించి ఆయనను సేవించగలము?**

సోమవారం డిశంబరు 6

## ఆకాశమహాకాశములు

దేవునితో ఇశ్రాయేలుకున్న బాంధవ్యమునకు నిబంధన మరియు ధర్మశాస్త్రము కేంద్రమైయుండుటయేగాక, ఇశ్రాయేలు ప్రజలు ఎన్నిక చేయబడిన దేశముగా దాని లక్ష్యము నెరవేరుటకు కూడా నిబంధన మరియు ధర్మశాస్త్రము కేంద్రమైయున్నదని చాలా స్పష్టముగ ద్వితియోపదేశకాండము వివరించుచున్నది (ద్వితి 7:6; 14:2; 18:5).

**ద్వితి 10:12-25 చదువుడి. ఇందులో ఇశ్రాయేలుకు ఎంపిక చేయబడిన హోదాతో పాటు ధర్మశాస్త్రమును కూడా కలిగియుందని నొక్కి చెప్పడం జరిగింది. అయితే ఇక్కడ ఆకాశము, మహాకాశము అని వాడబడిన పద సముదాయము యొక్క బైబిలు భావము ఏమిటి? ఆ పద సముదాయముతో మోషే ఏ విషయాన్ని వివరించాలని కోరియున్నాడు?**

"ఇక్కడ పేర్కొనబడిన సందర్భములో "ఆకాశమహాకాశములు" అంటే అర్థమేమిటో స్పష్టముగా లేకపోయినను మోషే మాత్రము దేవుని యొక్క వైభవము, మహాత్మ్యము,

శక్తిని గూర్చి వివరిస్తున్నాడు. ఆకాశము మాత్రమే కాదు, మహాకాశములు కూడా దేవునికి చెందినవే" అని సంప్రదాయానుసారమైన భాషలో సృష్టియావత్తు మీద దేవునికున్న సంపూర్ణ అధికారమును సూచించుచున్నవి.

**ఈ క్రింది వాక్యములను చదువుడి. ఇవన్నియు ద్వితియోపదేశకాండము ఆరంభములో కనిపించే వాక్య భాగము మీద ఆధారపడియున్నవి. ప్రతి వాక్యములోను ఏవిషయము ప్రధానమైనదిగా చూపబడెను. అక్కడ ద్వితియోపదేశకాండము యొక్క ప్రభావమును ఏవిధముగా చూడగలము?**

1 రాజు 8:27 ..................................................

నెహెమ్యా 9:6 ..................................................

కీర్తన 148:4 ..................................................

నెహెమ్యా 9లో దేవుడు సృష్టికర్త అనియు, ఆయన ఒక్కడే ఆరాధనకు పాత్రుడని స్పష్టమగుచున్నది. ఆకాశమహాకాశములను, సైన్యమును ఆయనే సృజించెను (నెహె 9:6). వాస్తవముగా చూచినచో నెహెమ్యా 9:3లో పేర్కొనబడినట్లు యోషీయా కాలములో వలెనే ఇక్కడ కూడా దేవుడైన యెహోవా ధర్మశాస్త్రము నుండి చదివినప్పుడు, లేవీయులు దేవునిని ఆరాధించేటపుడు, ఆయనను స్తుతించుచు "ఆకాశమహాకాశములు" అనే పద సముదాయమును వాడిరి. ఆ పదమును నేరుగా ద్వితియోపదేశకాండము నుండి నెహెమ్యా తీసుకొని యున్నాడు.

**దేవుడు భూమిని సృష్టించడమే కాకుండా ఆయన "ఆకాశమహాకాశములకును సృష్టికర్తయైయున్నాడు. అదే దేవుడు సిలువ మీదికి వెళ్ళాడని కూడా చూస్తున్నాము. దేవుడు చేసిన కార్యమునకు మన స్పందనగా ఆయనను ఆరాధించుట ఎందువలన తగిన చర్యయైయున్నది?**

మంగళవారం డిశంబరు 7

## యిర్మీయాలో ద్వితియోపదేశకాండము

కొన్ని సంవత్సరాల క్రితం నాస్తికుడైన (దేవుడు లేడనువాడు) ఒక యౌవనస్తుడు ఎంతో ఉద్రేకముతో సత్యాన్వేషణలో నిమగ్నుడై అనేక ప్రాంతాలు దర్శించాడు. చివరికి

అతడు తండ్రియైన దేవుని, యేసుని నమ్మి సెవెంతు డే ఎడ్వంటిస్టు వర్తమానమును కూడా అంగీకరించాడు. అతనికి బైబిలులో ఇష్టమైన వాక్యము యిర్మీయా 29:13. అందులో ఈవిధముగా వున్నది. "మీరు నన్ను వెదకిన యెడల పూర్ణ మనస్సుతో నన్ను గూర్చి విచారణ చేసిన యెడల మీరు నన్ను కనుగొందురు" (యిర్మీయా 29:13). కొన్ని సంవత్సరాల తరువాత తన బైబిలును చదువుచుండగా ఈ వాక్యమును మరొకసారి అతడు ద్వితియోపదేశకాండములో కనుగొన్నాడు. అనగా యిర్మీయా ఆ వాక్యమును మోషే నుండి పొందియున్నాడు.

**ద్వితి 4:23-29 చదువుడి. ఏ సందర్భములో ఇశ్రాయేలీయులకు ఈ వాగ్దానము ఇవ్వబడెను? అది ఏవిధముగా నేడు మనకు సంబంధము కలిగియున్నది?**

మనము ముందుగానే చూచినట్లుగా రాజైన యోషీయా కాలములో ద్వితియోపదేశకాండమును తిరిగి కనుగొన్నారు. అదే సమయములో యోషీయా పరిపాలించుచుండగా, యిర్మీయా తన సువార్త పరిచర్యను ఆరంభించాడు. అందుచేత యిర్మీయా చేసిన రచనలలో ద్వితియోపదేశకాండము యొక్క ప్రభావము కనబడుటలో ఆశ్చర్యములేదు.

**యిర్మీయా 7:1-7 చదువుడి. ఇశ్రాయేలు ప్రజలను ఏమి చేయమని యిర్మీయా అడిగాడు? ఆయన అడిగిన విషయము ద్వితియోపదేశకాండములో వ్రాయబడిన దానితో ఏవిధమైన సంబంధమును కలిగియున్నది?**

కానాను దేశములో ఇశ్రాయేలీయుల మనుగడ షరతులతో కూడుకొనియున్నదని అనేక పర్యాయములు మోషే ద్వితియోపదేశకాండములో తెలియపర్చాడు. ఇశ్రాయేలీయులు గనుక వారు చేసిన నిబంధనకు అవిధేయులైన యెడల దేవుడు వారి కొరకు ఎన్నిక చేయబడిన స్థలములో నివాసముండలేరు. ఆ విషయములో యిర్మీయా 7:4లో వారికివ్వబడిన ప్రత్యేకమైన హెచ్చరికను గమనించుడి. దాని ప్రకారము వారున్న ఆ స్థలము యెహోవా ఆలయము. వారు దేవుడు ఎన్నుకొనిన ప్రజలు అయితే వారు దేవునికి విధేయత చూపించనిచో ఆ యోగ్యత లేమీ పనిచేయవు.

వారు చూపించవలసిన విధేయతలో భాగముగా వారు పరదేశులను, అనాథులను విధవరాండ్రను ద్వితియోపదేశకాండములో పేర్కొనబడిన నిబంధనలోని కొన్ని

నియమముల ప్రకారము ఆదరిస్తున్నారో లేదో చూచుకొనవలసియున్నది. "పరదేశికే గాని తండ్రి లేనివారికే గాని న్యాయము తప్పి తీర్పు తీర్చకూడదు" (ద్వితి 24:17, ద్వితి 24:21, 10:18,19; 27:19 కూడా చూడుడి).

**యిర్మీయా 4:4 చదివి ద్వితి 30:6తో పోల్చి చూడుడి. అక్కడ ఇశ్రాయేలు ప్రజలకివ్వబడిన వర్తమానము ఏమిటి? అదే సూత్రము నేటి దేవుని ప్రజలకు కూడా ఏవిధముగా వర్తిస్తుంది?**

బుధవారం డిశంబరు 8

## దేవుడైన యెహోవా ఏమి అడుగుచున్నాడు?

ఇశ్రాయేలు ప్రజలు వారి విశ్వాస్యతను చూపించాలని ప్రవక్తల యొక్క రచనలలో చాలా చోట్ల హెచ్చరించారు. సాధారణముగా వారు చూపించే విశ్వాస్యత కాదు గాని, ప్రత్యేకించి వారు వాగ్దానభూమిలోనికి ప్రవేశించకపూర్వము చేసిన నిబంధనకు విశ్వాస్యత చూపించాలని వారికి గుర్తు చేయడం జరిగింది. ద్వితియోపదేశకాండములో ఈ విధముగా వివరించబడెను. ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధనను మరల స్థిరము చేసుకొనెను. ఇప్పుడు ఇశ్రాయేలీయుల యొక్క 40 సం॥ యాత్ర అనంతరము దేవుడైన యెహోవా వారికి చేసిన నిబంధన వాగ్దానమును నెరవేర్చబోవుచున్నాడు. అందుచేత ఇశ్రాయేలు ప్రజలు వారి పక్షమున హితబోధ చేయుచున్నాడు. ప్రాథమికముగా అదే విషయాన్ని ప్రవక్తలు కూడా చెప్పియున్నారు.

**మీకా 6:1-8 చదువుడి. ఇక్కడ ఇశ్రాయేలు ప్రజలతో యెహోవా దేవుడు ఏమి చెప్పాడు? ఆ విషయాలు ద్వితియోపదేశకాండముతో ఏ విధముగా ఏకీభవిస్తున్నాయి? (ఆమోసు 5:24; హోషేయ 6:6 కూడా చూడుడి).**

మీకా గ్రంథములోని ఈ వచనాలలో ''నిబంధన వ్యాజ్యము (న్యాయపోరాటములో దేవుడైన యెహోవా తన ప్రజలు నిబంధనను మీరినందుకు వారికి వ్యతిరేకముగా వ్యాజ్యము చేయుచున్నాడు (దావా చేయుచున్నాడు). దానినే మీకా ఈవిధముగా చెప్పాడు. "తన జనుల మీద యెహోవాకు వ్యాజ్యము కలదు. ఆయన ఇశ్రాయేలీయుల మీద వ్యాజ్యమాడుచున్నాడు" (మీకా 6:2). ఈ వాక్యము ఫిర్యాదు (రివ్) అనే న్యాయశాస్త్ర సంబంధమైన తగాదా ఉన్నట్లు చూపించబడింది.

అనగా వారు చేసుకొనిన నిబంధనలో న్యాయపరమైన విషయాలున్నవి. అవి మీరినట్లయితే ఉల్లంఘన క్రిందకు వచ్చి శిక్షార్హులగుదురనే భావము అందులో ఇమిడియున్నది.

ఈ సందర్భములో కూడా మీకా ద్వితియోపదేశకాండము నుండి నేరుగా ఈ క్రింది వాక్యములను తీసుకున్నాడు.

"కాబట్టి ఇశ్రాయేలూ, నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయన మార్గములన్నిటిలో నడుచుచు, ఆయనను ప్రేమించి, నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణమనసుతోను, నీ పూర్ణాత్మతోను సేవించి, నీ మేలు కొరకు నేడు నేను నీకాజ్ఞాపించు యెహోవా ఆజ్ఞలను కట్టడలను అనుసరించి నడుచుకొందునను మాట కాక నీ దేవుడైన యెహోవా నిన్ను మరి ఏమి అడుగుచున్నాడు" (ద్వితి 10:12, 13). ద్వితియోపదేశ కాండము నుండి ఈ వాక్యాలు తీసుకున్నా మీకా అందులో "ధర్మశాస్త్రమును అక్షరానుసారముగా" పాటించుటను మార్పు చేసి దానికి ధర్మశాస్త్రమును ఆత్మానుసారముగా పాటించడమనే" భావమును చేర్చాడు. అనగా న్యాయము గాను దయగల్గి ప్రవర్తించాలనే భావమును ఎన్నుకున్నాడు.

ఇక్కడ జరుగుచున్న సన్నివేశములో వేలాది పొట్టేళ్ళను బలియర్పించుట, మత నిష్ట కలిగియుండుట, భక్తిపరుల వలె ప్రవర్తించుట, దేవునితో ఇశ్రాయేలు చేసుకున్న నిబంధనలో భాగము కాదు. వారు భూములను ఆశించి పట్టుకొందురు. ఇండ్లు ఆశించి ఆక్రమించుకొందురు. ఒక మనిషిని వాని కుటుంబమును ఇంటివానిని వాని స్వాస్థ్యమును అన్యాయముగా ఆక్రమింతురు" మీకా 2:2. దీనికి బదులు నిబంధనలో భాగముగా న్యాయమును జరిగించేవారు, కనికరమును చూపువారైన ప్రజలుగా ఇశ్రాయేలు ఉండాలని దేవుడు కోరుచున్నాడు" (ద్వితి 4:6).

**గురువారం** **డిశంబరు 9**

## దానియేలు యొక్క ప్రార్థన

పాతనిబందన గ్రంథమంతటిలోను ప్రసిద్ధి కెక్కిన ప్రార్థనలలో ఒకటి దానియేలు 9లో ఉంది. దానియేలు, యిర్మియా గ్రంథమును చదువుచుండగ ఇశ్రాయేలీయుల యొక్క యెరూషలేము "పాడుగా" (డెజొలేషన్) (దాని 9:2) ఉండవలసిన 70 సం॥లు సంపూర్తి

అవుచున్నదని గ్రహించి దానియేలు మనః పూర్తిగా ప్రార్ధన చేయడం ప్రారంభించాడు.

ఇశ్రాయేలీయులు ఆపదలో చిక్కుకుని పతనమైన స్థితిలో కూడా దేవుని యొక్క న్యాయమును గుర్తించినవాడై దానియేలు తన పాపములను, తన ప్రజల యొక్క పాపాలను ఒప్పుకొని తీక్షణముగా కన్నీళ్ళతో చేసిన ప్రార్ధన బహు ప్రసిద్ధి కెక్కినది.

**దాని 9:1-19 చదువుడి. ద్వితియోపదేశకాండమునకు నేరుగా సంబంధమున్న ఏ ప్రధాన అంశాలు పై వాక్యాలలో చూడగలరు?**

ఇశ్రాయేలు ప్రజలు నిబంధనను గైకొనకపోవుట వలన కలిగిన ఫలితములను గురించి చేయబడిన హెచ్చరికలను ద్వితియోపదేశకాండములో పేర్కొనబడినవి. వాటిని గూర్చి సంగ్రహముగ దానియేలు యొక్క ప్రార్ధనలో కనిపిస్తాయి. ద్వితియో పదేశకాండములో మోషే పేర్కొనిన ధర్మశాస్త్రమును గూర్చి రెండుసార్లు దానియేలు ప్రస్తావించాడు (దాని 9:11,13).

ద్వితియోపదేశకాండములో చెప్పబడినట్లు వారు దేశములో నుండి తోలివేయబడిరి (ద్వితి 4:27-31; ద్వితి 28) మోషే చెప్పినట్లుగానే వారు విధేయత చూపకపోవుట వలన (ద్వితి 31:29) ఆవిధముగా జరిగెను.

ఇశ్రాయేలు దేశము చుట్టూ ఉన్న ఇతర దేశాల ప్రజలు వారిని చూచి 'నిజముగా ఈ గొప్ప దేశము యొక్క ప్రజలు జ్ఞాన వివేకములు కలిగిన ప్రజలు (ద్వితి 4:6) అని చెప్పవలసిన సమయములో, అవిధేయత వలన ఇశ్రాయేలు దేశములో సకల ప్రజల యెదుట 'నిందాస్పదమైనది' (దాని 9:16).

విపత్తు సంభవించినపుడు అనేకమంది 'ఎందుకు?' ఇది సంభవించినదని సామాన్య ప్రశ్నను అడిగినట్లు దానియేలు కన్నీళ్ళతో ప్రార్ధన చేసినప్పుడు అటువంటి ప్రశ్నను అడగలేదు. ఎందుచేతనంటే విపత్తు సంభవించుటకు కారణము ద్వితియోపదేశకాండము బాగుగా వివరించినది. కాబట్టి ఇశ్రాయేలు ప్రజలకు కలిగిన దుస్థితి ఏదో విధి వలన గుడ్డిగా సంభవించినది కాదనియు ఆ స్థితికి కారణము వారి యొక్క అవిధేయతేయని దానియేలుకు తెలుసు. అందుచే ఈ విధముగా 'ఎందుకు' జరిగిందనే ప్రశ్న అతడు వేయలేదు.

అయితే ఎన్నో సంఘటనలు జరిగినప్పటికి, దానియేలు వాస్తవమును లేక యాదార్ధ

స్థితిని తెలిసినవాడై, వీటి వెనుక ఒక గొప్ప నిరీక్షణ ఉందని తన ప్రార్థనలో చెప్పాడు. దేవుడు ఇశ్రాయేలీయులను విడనాడలేదు. వారు ఎంతగా అవిధేయతను చూపించినను తిరిగివారు వాగ్దానభూమిలోనికి వస్తారనే వాగ్దానమును ద్వితియోపదేశకాండము ఈ సందర్భముగా తెలియజేయుచున్నది.

**దాని 9:24-27 చదువుడి. దానిలో యేసు యొక్క జీవితము సిలువ మీద ఆయన మరణమునకు సంబంధించిన ప్రవచనమును చూడగలము. ఈ ప్రవచనములో భాగముగా ఇశ్రాయేలు ప్రజలు తిరిగి వారి దేశానికి వెళ్ళుదురు అనే వాగ్దానమున్నదా?**

**శుక్రవారం** **డిశంబరు 10**

## అదనపు అధ్యయనము

'మీకా 6:1-8లో ఉన్న ఈ వాక్యములు పాతనిబంధనలో ఉన్న వాక్యాలలో ఘనమైనవి. 8వ శతాబ్దములో ఉన్న ప్రవక్తల వర్తమానములైన ఆమోసు 5:24 మరియు హోషేయ 6:6 ఉదాహరణగా ఇవ్వబడినవి. ఈ వాక్యాలు ఒక చక్కటి నిబంధన వ్యాజ్యముతో ఆరంభమై యావెహ్ ప్రజలకు వ్యతిరేకముగా చేసిన ఆరోపణను ముందుగా వారిని వినమని ప్రవక్త ద్వారా తెలియపర్చబడెను. ఎంతో కాలము నుండి ఉంటున్న కొండలు మరియు గుట్టలు ఆ వ్యాజ్యమునకు సాక్షులుగా ఉన్నవి. దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో ఏవిధముగా వ్యవహరించాడో అవి చూచినవి గనుక వాటిని సాక్షులుగా ఇక్కడ దేవుడు వారిని ప్రశ్నిస్తూ, వారికి ఆయనకు వ్యతిరేకముగా ఏదైనా వ్యాజ్యమున్నదా అని అడుగుచున్నాడు. "నేను మీకేమి కీడు చేసితిని? నేను మిమ్ములను ఏరీతిగా విసిగించితిని? కొంతమంది స్వార్థపరులు అవకాశవాదులు ఇతరులను బాధించుట వలన వారు విసుగు చెందియుండవచ్చును లేక నిబంధనను గైకొనకుండా విసుకు చెందవచ్చును" -రాల్ఫ్ ఎల్ స్మిత్, బైబిలు వాక్య కామెంటరీ, మీకా, మలాకి. సంపుటి 32, పుట 50.

"రాజైన యోషీయా ఏలుబడిలో సంస్కరణను చేపట్టినపుడు, అప్పటిలో అడుగడుగున ఉన్న విగ్రహారాధనకు సంబంధించిన బలిపీఠములు నాశనము చేయబడెను. చాలా కాలము ఇశ్రాయేలు ప్రజలు చుట్టు ప్రక్కలున్న దేశములు అనుసరించిన

విగ్రహారాధనను అనుసరించి, రాళ్ళను చెక్కలను పూజించిరి. అయితే యోషీయా వారి దేశమును పవిత్ర పరచే కార్యములో నిమగ్నమయ్యాడు". ఎలెన్ జి వైట్, ప్రవక్తలు మరియు రాజులు, పుట 401.

**చర్చించుకొనుటకు ప్రశ్నలు :**

1. మనము సెవెంతు డె ఎడ్వెంటిస్టు సభ్యులముగా నేటి కాలమునకు అవసరమైన వర్తమానముతో పురాతన ఇశ్రాయేలు ఉన్న స్థానములో ఉన్నట్లు ఉన్నాము. లోకానికి ప్రకటించవలసిన సత్యము మన యొద్ద ఉంది. అది మనకు గొప్ప అవకాశమును, ఆధిక్యతను ఇస్తుంది. ఆ ఆధిక్యతతో పాటు వచ్చే బాధ్యతల విషయమై మనము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామా?
2. దానియేలు స్థానములో మిమ్ములను పెట్టుకొని ఊహించుకోండి. మీ దేశముపై ఇతర దేశముల వారు దండెత్తి ఓడించారనుకోండి. అక్రమముగా మీ మతానికి కేంద్ర స్థానమైన దేవాలయము కూల్చివేయబడినదనుకోండి. అలా జరుగుతుందని లేఖనముల ద్వారా (ద్వితియోపదేశకాండములో ఉన్నట్లు) తెలుసుకున్నట్లయితే మీరేమి చేయగలరు? మన విశ్వాసమునకు బైబిలు ఎందుకు కేంద్ర బిందువుగా ఉన్నది?
3. మీ తరగతిలో దానియేలు 9:24-27లో ఉన్న 70 వారాల ప్రవచనమును గూర్చి చర్చించండి. ఆ ప్రవచనములో నిబంధనకున్న పాత్ర ఏమిటి? మనకు ఆ నిబంధన భావము ఎందుకంత ప్రాముఖ్యమైనది?

❖❖❖